ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY 5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శుక్రవారం 27 జూన్ 2025



విజయను వీడి.. ప్రైవేట్ వైపు పయనం

- పాల ధర తగ్గింపు ఎఫెక్ట్

- రైతుకు భారమవుతున్న పాడిఆవుల పోషణ
- బిల్లులు రాక... ప్రోత్సాహం లేక ఇక్కట్లు
- పాల ధర తగ్గించిన విజయ డెయిరీ
- ప్రైవేటు డెయిరీల వైపు వెళుతున్న రైతులు



పాలు పితుకుతున్న రైతు(ఫైల్)



కేంద్రంలో పాలుపోస్తున్న రైతు(ఫైల్)

పాడిని నమ్ముకున్న రైతుకు ముందు నుయ్యి. వెనుక గొయ్యి అన్న చందాన పరిస్థితి తయారైంది. అసలే ప్రభుత్వ ప్రోత్సాహకం అందక... బిల్లులు రాక ఆవేదన చెందుతుంటే.. ఉన్న పాల ధరను అమాంతం తగ్గించడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పశుపోషణ భారమై.. నమ్ముకున్న విజయ డెయిరీ సంస్థ పట్టీపట్టనట్లు ఉండటంతో ప్రైవేట్ డెయిరీల వైపు మొగ్గుచూపుతున్నారు. పాలసేకరణ లో రాష్ట్రంలోనే విజయ డెయిరీ నాగర్‌కర్నూల్ జిల్లా రెండో స్థానంలో ఉన్నది. ఈ ప్రాంతంలో అధికంగా రైతులు పాడిపరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్నారు. ఈ క్రమంలో హెచ్‌ఎఫ్, జెర్సీ, ఏబీఎస్ వంటి సంకరజాతి ఆవులను మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసుకుని పాల వ్యాపారం సాగిస్తున్నారు. జిల్లాలో సుమారు 7 వేలమంది రైతులు 225 విజయ డెయిరీ పాలసేకరణ కేంద్రాల్లో పాలుపోస్తున్నారు. ఉన్నఫలంగా గత ఏప్రిల్ నుంచి ఆవుపాలకు ఏకంగా లీటరుకు రూ. 3 నుంచి రూ.4 తగ్గించడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. దిక్కుతోచక ప్రైవేట్ డెయిరీల వైపు చూస్తున్నారు.

- వెల్దండ, (ఆంధ్రజ్యోతి)

6

ప్రోత్సాహం లేక ప్రైవేటులో పాలు పోస్తున్నాను



ఏళ్లకాలంగా విజయ డెయిరీలో పాలుపోసేవాడిని. కానీ గత రెండు నెలలుగా ఉన్నఫలంగా ఆవుపాలకు లీటరుకు రూ. 4 తగ్గించింది. గతంలో ఇచ్చిన రూ. 4 ప్రోత్సాహకం కూడా ఇవ్వడంలేదు. బిల్లులు సైతం పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో విధిలేని పరిస్థితిలో గ్రామంలోని మస్కతి డెయిరీలో పాలుపోస్తున్నాను.

- మాదిరెడ్డి సతీష్‌రెడ్డి, పాడిరైతు, వెల్దండ



ప్రాణసంకటం!

● దయనీయ స్థితిలో డయాలసిస్ రోగులు

- వనపర్తి సెంటర్ ద్వారా వైద్యం పొందుతున్న 90 మంది రోగులు
- వెయిటింగ్ లిస్టులో 15 మంది చికిత్స కోసం ఎదురుచూపులు
- ప్రారంభానికే పరిమితమైన ఆత్మకూర్ డయాలసిస్ సెంటర్
- ప్రైవేటులో ఒక్కసారికి రూ. 3500 నుంచి రూ. 5 వేల వరకు ఖర్చు
- ఒకరికి వారంలో రెండుసార్లు అవసరమవుతున్న డయాలసిస్

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కిడ్నీలు పాడైన వారికి కృత్రిమంగా యంత్రాల ద్వారా రక్తన్ని శుద్ధి చేయాల్సి ఉంటుంది. డయాలసిస్ బారిన పడ్డ రోగులు వారంలో రెండు సార్లు, అత్యంత కీలక దశలో ఉండే వారికి వారంలో మూడు సార్లు కూడా డయాలసిస్ అవసరం ఉంటుంది. అలాంటి హృదయ విదారక స్థితిలో ఉండే డయాలసిస్ రోగులకు జిల్లాలో ప్రాణసంకట పరిస్థితు లు నెలకొన్నాయి. డయాలసిస్ కేంద్రం నుంచి వైద్యం పొందడానికి ఆశగా 15 మంది వెయిటింగ్ లిస్టులో ఉండి ఎదురుచూస్తున్నారు.



వనపర్తి కేంద్రంలో వైద్యం పొందుతున్న డయాలసిస్ రోగులు(ఫైల్)

● ప్రారంభానికే పరిమితం..

ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్ సెంటర్ పరిధిలో డయాలసిస్ కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ చేతుల మీదుగా ఈ ఏడాది ప్రారంభించారు.

కానీ ఇట్టి కేంద్రం కేవలం ప్రారంభానికి మాత్రమే పరిమితం కావడం డయాలసిస్ రోగులకు శాపంగా మారింది. ప్రస్తుతం ఆత్మకూర్‌లో కంటైనర్ ద్వారా చికిత్స అందించేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. టెక్నికల్ వర్క్స్ జరుగుతున్న ఆత్మకూర్ సెంటర్ వైద్యం అందించే ప్రక్రియ మొదలు పెడితే వనపర్తి కేంద్రంలో వెయిటింగ్ లిస్టులో ఉండే 15 మందితో పాటు మరి కొందరికి కూడా దయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో వనపర్తి కేంద్రం తరువాత ఆత్మకూర్ కేంద్రం ప్రభుత్వ అనుసంధానంలోకి రానుండగా పెబ్బేరులో ఒక కేంద్రం ప్రైవేటు డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

నాలుగు షిఫ్టుల్లో..

వనపర్తి డయాలసిస్ కేంద్రం 2017లో ప్రారంభమైంది. మొదటగా 5 పడకలతో ప్రారంభమైన కేంద్రం ప్రస్తుతం 10 పడకలతో రోగులకు డయాలసిస్ సేవలను అపెక్స్ సంస్థ ద్వారా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం అందిస్తుంది. తొమ్మిది పడకల్లో సాధారణ డయాలసిస్ రోగులకు, ఒకటి పాజిటివ్ రోగులకు కలిపి పది పడకలతో రోజుకు నాలుగు షిఫ్టుల ప్రకారం చికిత్స అందిస్తున్నారు. ఒకసారి ఒక్కరికే ఉపయోగించే డైలైజర్, బ్లెడ్ టూబింగ్స్ వంటి పరికరాలతో నాలుగు గంటల పాటు అందించే డయాలసిస్ చికిత్సలో 90 మంది ప్రభుత్వ డయాలసిస్ వైద్యం పొందుతున్నారు. కానీ వనపర్తి డయాలసిస్ కేంద్రంలో వైద్యం కోసం పేరు నమోదు చేసుకుని వెయిటింగ్ లిస్టులో 15 మంది ఎదురుచూస్తున్నారు. ఉదయం 6 గంటలకు మొదలయ్యే వైద్యం నిర్విరామంగా అర్ధరాత్రి ఒంటిగంట వరకు కొనసాగుతుంది. ఇదే వైద్యం ప్రైవేటులో పొందాలంటే ఒక్కసారి రూ. 3500 నుంచి రూ. 5 వేల వరకు ఖర్చు అవుతుంది.

వైద్య విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలి

- కలెక్టర్ సంతోష్



మెడికల్ కళాశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. తనిఖీ సమయంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందితో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ కళాశాల తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టల్ గదులు, వసతి సముదాయాలు, భోజన శాల వంటి భాగాలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై ఆయన ప్రిన్సిపాల్‌తో చర్చించారు.

కళాశాల పరిసరాల్లో శుభ్రత, నీటి సరఫరా, విద్యుత్, ఇంటర్నెట్, కళాశాలలో విద్యార్థుల వసతి, భద్రత, చదువుకు అవసరమైన ఆధునిక ల్యాబ్ పరికరాలు గ్రంథాలయ వసతులు వంటి అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల అదనపు భవనాలు, హాస్టల్ సముదాయాల పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైద్య కళాశాల అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో టూరిస్టు బస్సు బోల్తా

- బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండను ఢీకొట్టిన డ్రైవర్
- జనగామ నుంచి శ్రీశైలం వెళుతున్న భక్తులు
- తప్పిన ప్రాణాపాయం, ఏడుగురికి స్వల్ప గాయాలు

7



దోమలపెంటలో బోల్తా పడిన టూరిస్టు బస్సు

బీసీ స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు వరం

- 6 సంవత్సరాల్లో 1,800 మందికి శిక్షణ
- 50 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు
- గద్వాల, వనపర్తి జిల్లాల వారికి శిక్షణ

7



గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న యువతీయువకులు(ఫైల్)

పేదల్లో వికాసం నింపింది మోదీనే..

- ఆశ పెట్టి మోసం చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కే సాధ్యం
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

7

'సాయిచంద్ యాది'లో సభను జయప్రదం చేయాలి

- గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని
- అమరచింతలో ఇంటింటి ప్రచారం

7

దేవాలయాల పటిష్టతకు ప్రభుత్వం కృషి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

6

ఫ్యాక్టరీ కాలుష్యం నుంచి కాపాడాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతు

6

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- సల్కాపురం క్రషర్ వద్ద ఘటన
- నిర్వాహకులతో కుటుంబ సభ్యుల వాగ్వాదం

7

మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్

నాగర్‌కర్నూల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్ అన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల క్రీడా ప్రాంగణం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, అంబేద్కర్ కూడలి వరకు జిలా ప్రదాన న్యాయాధికారి రమాకాంత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా, ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల అలవాటు పడితే దేశం నాశనమవుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్పీ మాట్లాడారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రాజేశ్వరి, డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మీ, డీఎస్పీ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, పోలీస్ జిల్లా సంక్షేమ శాఖ, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రమాకాంత్

ఆహ్లాదం కోసం మరిన్ని వసతులు కల్పించండి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- నల్లచెరువు మినీ ట్యాంక్ బండ్ పరిశీలన
- మునిసిపల్ డీఈకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం

వనపర్తి టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం మినీ ట్యాంక్ బండ్‌పై మరిన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. గురువారం పట్టణంలోని నల్లచెరువు మినీ ట్యాంక్ బండ్‌ను కలెక్టర్ మునిసిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం నడకతో పాటు కుటుంబంతో ఆహ్లాదంగా గడిపేందుకు మినీ ట్యాంక్ బండ్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఇప్పటికే మంజూరు చేసిన పనులను చాలా ఆలస్యంగా పూర్తి చేస్తున్నారని, త్వరగా పూర్తి చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మునిసిపల్ డీఈకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమేష్‌రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



నల్లచెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి



జూరాలకు పసిడి సొబగులు

జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు గురువారం పసిడి వర్ణంలోకి మారింది. సాయంత్రం వేళ సూర్యుని కిరణాలు పడి, ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తళతళా మెరిసిపోయింది. ప్రాజెక్టును చూడటానికి వచ్చిన సందర్శకులు ఈ సుందర దృశ్యాన్ని చూసి సంబురపడ్డారు.

- ఆంధ్రజ్యోతి, గద్వాల

రూ.6,472కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గద్వాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు ప్రాధాన్యత రంగాలకు విరివిగా రుణాలు అందించేందుకు రూ.6,472 కోట్లతో రుణ ప్రణాళికను ఖరారు చేసినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. గురువారం ఐడీఓసీ హాల్‌లో డీసీసీ డీఎల్ఆర్సీ జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు వ్యవసాయ రుణాలు, ఉపాధి యూనిట్లు, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రంగాలకు, అర్హులైన పేద ప్రజలకు రుణాలను మంజూరు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి చిన్న తరహా ఆహార వృద్ధి పథకం కింద జిల్లాలో మంజూరు అయిన 18 యూనిట్లకు 35శాతం చొప్పున రూ.27.60లక్షల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని సూచించారు. చిన్న వ్యాపారుల రుణ దరఖాస్తులను వెంటనే ఆమోదించి రుణాలు అందించాలని సూచించారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.6,472.29 కోట్లను అందించే లక్ష్యంగా కలెక్టర్ ప్రకటించారు. గత ఏడాది కంటే ఇది రూ.1221.21కోట్లు ఎక్కువగా లక్ష్యాన్ని కేటాయించినట్లు తెలిపారు. వార్షిక క్రెడిట్ ప్లాన్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రూ.4,945.14కోట్లు ఇవ్వాలని సూచించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.606కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.192.84కోట్లు, విద్యారుణాలకు రూ.16.80కోట్లు, గృహ రుణాలకు రూ.124.22 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాంకర్లకు విధించిన టార్గెట్‌ను వందశాతం పూర్తయ్యే విధంగా చూడాలని సూచించారు. బ్యాంకర్లు అందించే రుణాలతోనే ప్రాధాన్యత రంగాల్లో అభివృద్ధి జరిగి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రజల జీవన విధానం మెరుగు పడుతుందని ఆయన వివరించారు. అదనపు కలెక్టర్లు నర్సింగరావు, ఎల్‌డీఏ శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి, ఆర్‌బీఐ ఏటీఎం చేతన్, ఇండస్ట్రీయల్ డీఎం రామలింగేశ్వర్ గౌడ్, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ కాలుష్యం నుంచి కాపాడాలి

» కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతు


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు రామిరెడ్డి

ఎర్రవల్లి, జూన్26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం లోని కొండేరు గ్రామ శివారులో ఉన్న ఎస్ఎన్ఎస్ ఫ్యాక్టరీ కాలుష్యం నుంచి తమను కాపాడాలని రైతు రామిరెడ్డి గురువారం కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. 13ఏళ్ల నుంచి తన భూమిని లీజుకు తీసుకుని ఏడాది వదిలేశారని, ఇప్పుడు పంట సాగు చేయాలంటే వ్యర్థజలం వదిలి బూడిద పడి పంటకు అనువుగా లేదని తెలిపారు. దీంతో కంపెనీ యాజమాన్యం న్యాయం చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. వ్యర్థజలం, బూడిద, దుర్వాసనతో చుట్టూ పొలాలు, గ్రామాలకు తీరని సమస్యగా మారిందని విన్నవించారు.

36 గంటల పాటు నీటి సరఫరా నిలిపివేత

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 36 గంటలపాటు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మహబూబ్‌నగర్ మిషన్ భగీరథ డివిజన్ ఇంజనీరు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నుంచి నారాయణపేటకు వెళ్లే మార్గంలో మరికల్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల మరమ్మతు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దేవరకద్ర, నారాయణపేట, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 245 గ్రామాలు, మూడు మునిసిపాలిటీల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రైతులకు సకాలంలో సాగునీరు

» దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


సరళాసాగర్ లిఫ్టు మోటార్లకు పూజలు చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ ఎత్తిపోతల పథకం మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూరాలకు వరద రావడంతో సరళాసాగర్ లిఫ్టు ద్వారా ప్రాజెక్టును నింపుతామని తెలిపారు. త్వరలోనే సరళాసాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తామని అన్నారు. ఇప్పటికే రైతులందరికీ రైతుభరోసా అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, మహేష్‌కుమార్, వెంకట్‌నారాయణ, కృష్ణవర్ధన్‌రెడ్డి, జగదీష్, వడ్డె కృష్ణ పాల్గొన్నారు.

హంస వాహనంపై గోవిందుడు


భక్తిగీతాలాపన చేస్తున్న శోభాయుగేంధర్‌రావు


హంస వాహనంపై గోవిందుడు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాటన్‌మిల్ సమీపంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు గురువారం ప్రాతఃకాల పూజలు, మూలమంత్ర జపం, చంద్రమౌళీశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శోభాయుగంధర్‌రావుచే సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భజన మండలి సభ్యులచే భక్తిగీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం స్వామి వారిని హంసవాహనంపై ప్రత్యేకంగా అలంకరణ చేసి ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో భజనమండలి సభ్యులు, భక్తులు పాల్గొని గోవిందనామస్మరణ చేశారు.

'విజయ'ను వీడి..
ప్రైవేట్ వైపు పయనం


వెల్దండలో పాడి ఆవులతో షెడ్

» పాల ధర తగ్గింపు ఎఫెక్ట్

» రైతుకు భారమవుతున్న పాడిఆవుల పోషణ

» బిల్లులు రాక... ప్రోత్సాహం లేక ఇక్కట్లు

» పాల ధర తగ్గించిన విజయ డెయిరీ

వెల్దండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీలో పాలుపోసే రైతులకు పాల ధరలు పెంచడం మాట అటుంచితే ఉన్న ధరలను తగ్గించింది. ఉన్నఫలంగా గత ఏప్రిల్ నుంచి ఆవుపాలకు ఏకంగా లీటరుకు రూ. 3 నుంచి 4 రూపాయలు తగ్గించడంతో పాడిపరిశ్రమనే నమ్ముకున్న రైతాంగం ఆందోళన చెందుతోంది. గోటిపై రోకటిపోటు అన్న చందంగా దాణా ధరలు పెరగడం, నిర్వహణ భారంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా సకాలంలో బిల్లులు రాక, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన లీటరుకు రూ. 4 ప్రోత్సాహకం జాడేలేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విధిలేక విజయ డెయిరీ నుంచి ప్రైవేటు పాలసేకరణ కేంద్రాల వైపు చూస్తున్నారు.

రాష్ట్రంలో రెండో స్థానంలో విజయ డెయిరీ

రాష్ట్రంలో పాలసేకరణలో నాగర్‌కర్నూల్ జిల్లాలో విజయ డెయిరీ రెండో స్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో అధికంగా రైతులు పాడిపరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్నారు. రైతులతో పాటుగా నిరుద్యోగ యువత పాడిపరిశ్రమ రంగంలోకి వచ్చారు. ఈ క్రమంలో హెచ్ఎఫ్, జెర్సీ, ఏబీఎస్ వంటి సంకరజాతి ఆవులను మహారాష్ట్రలోని లోని, దేవుని, కర్ణాటకలోని చింతామణి, ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరు వంటి ప్రాంతాల నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 7 వేలమంది రైతులు గ్రామాల్లో ఏర్పాటుచేసిన 225 విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రాల్లో పాలుపోస్తున్నారు. దీనికిగాను జిల్లాలో కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రంతో పాటు వెల్దండ, కొండారెడ్డిపల్లి, ఊర్కొండ, కుప్పగండ్ల, మాదారం, గుండూరు, అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో బీఎంసీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ప్రతిరోజు ప్రస్తుతం సుమారు 96వేల లీటర్ల పాలు పోస్తున్నారు. అంతేగాక గ్రామాల్లో ప్రైవేటు డెయిరీలు అయిన మస్కతి, తిరుమల, హడ్సన్ వంటి పాలసేకరణ కేంద్రాలు వెలిశాయి.

బిల్లులు రాక ... ధరలేక ..

విజయ డెయిరీ రైతులు గత కొన్ని నెలలుగా సకాలంలో బిల్లులు రాకపోవడం, ఇటీవల ఆవుపాల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం, గతంలో ఇచ్చిన పాడికి ప్రోత్సాహకం జాడే లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ పదిహేను రోజులకు ఒకసారి వచ్చే బిల్లులు రెండు, మూడు పెండింగ్‌లో ఉంటున్నాయి. గత ప్రభుత్వం 2016లో విజయ డెయిరీ ద్వారా రైతులను ప్రోత్సహిస్తూ లీటరుకు రూ. 4 చెల్లించింది. కాగా గత 2020 నుంచి ప్రోత్సాహకం బిల్లులు ఆగిపోయాయి. సంబంధిత అధికారుల అంచనా ప్రకారం సుమారు 35 కోట్లకు పైగా ప్రోత్సాహకం బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు, ప్రోత్సాహకం మాటటుంచితే.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఉన్నఫలంగా ఆవుపాల ధరలు అమాంతంగా లీటరుకు రూ. 3 నుంచి 4 వరకు తగ్గించింది. మద్దతు ధర కల్పించి ప్రోత్సహించాలి గానీ ధరలు తగ్గించడమేమిటని పాడిరైతులు ప్రశ్నిస్తున్నారు. పాలకుల నిర్ణయంతో గతేడాది ఇదే సీజన్‌లో సుమారు లక్షా 2వేల లీటర్ల పాలసేకరణ ప్రస్తుతం 96వేలకు పడిపోయింది. విజయ పాడిరైతులు ఒక్కొక్కరుగా కేంద్రాలను వీడి గ్రామాల్లోని మస్కతి, తిరుమల, హడ్సన్, దొడ్ల వంటి ప్రైవేట్ డెయిరీల వైపు వెళుతున్నారు. విజయ డెయిరీకి ప్రైవేటుకు పెద్దగా ఏమీ తేడా లేనప్పటికీ ప్రైవేటులో ప్రతీ పదిరోజులకోసారి సకాలంలో బిల్లులు ఇస్తున్నారని రైతులు తెలిపారు. పాలక ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీ రైతులను ఆదుకోవాలని, సకాలంలో బిల్లులు చెల్లించి, లీటరుకు తగ్గించిన ధరలను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకం బకాయిలను చెల్లించాలని పాడి రైతులు కోరుతున్నారు.

భారమవుతున్న పాడిపశువుల పోషణ



ఆవుపాల ధరను తగ్గించడంతో పాడి పశువుల పోషణ భారమవుతున్నది. ప్రతి రోజు సుమారు కేంద్రంలో 40 లీటర్ల వరకు పాలుపోస్తాను. గత రెండు నెలలుగా పాల ధరను తగ్గించడంతో నెలకు సుమారు 5వేల వరకు ఆదాయం తగ్గింది. దీంతో ఆవుల దాణాకు, మందులకు సైతం ఇబ్బందులు పడుతున్నాను. తగ్గించిన పాలధరను ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించాలి.

- మిరియాల సత్యనారాయణ, రైతు, వెల్దండ

మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ...



పాడి రైతులు తగ్గిన ధరలతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆవుపాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకే పాలు సరఫరా అవుతున్నాయి. ఈ క్రమంలో రైతులను ఆదుకునేందుకు మార్కెట్‌లో డిమాండ్ నేపథ్యంలో గేదె పాలకు విజయ డెయిరీ ద్వారా రూ. 5 అదనంగా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న డిమాండ్ నేపథ్యంలో గేదెల పెంపకం పట్ల ఆసక్తి కనబరిస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు.

- సత్యనారాయణ యాదవ్, విజయ డెయిరీ, నాగర్‌కర్నూల్ డిప్యూటీ డైరెక్టర్

హిందూ ధర్మాన్ని ఎవరూ ఆపలేరు

» గోసంరక్షణకు శివాజీ స్ఫూర్తి కావాలి

» గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


పేరపళ్లలో శివాజీ విగ్రహం ఆవిష్కరణలో మాట్లాడుతున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

నారాయణపేట రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మాన్ని ఎవరూ ఆపలేరని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గురువారం నారాయణపేట మండలంలోని పేరపళ్ళ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆనాడే మొగలులు, బ్రిటీషులు ఎన్ని ప్రయత్నాలుచేసినా హిందూ సమాజం చెక్కు చెదర లేదన్నారు. హిందూ ధర్మ రక్షణకు శివాజీ చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సనాతన ధర్మ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు గోరక్షణ చేయాలన్నారు. శివాజీ తన 12వ ఏటనే గోవులను రక్షించాడన్నారు. నేడు ఒక వర్గం ఓట్లకోసం హైదరాబాద్ నగరం నుంచి రోజు గోవులను అక్రమంగా తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకుని ధర్మరక్షణ కోసం కృషిచేయాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి, వీరసావర్కర్, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.సత్య యాదవ్, నందునామాజీ, రాజ్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పటిష్టతకు ప్రభుత్వం కృషి

» అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

» రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల ప్రమాణ స్వీకారం


దేవస్థానం ధర్మకర్తలతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని గట్టుతుమ్మెన్ గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవానికి గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదని, అందులో భాగంగా ఆలయాలను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. అదే విధంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం చైర్మన్‌గా బతుక మల్లయ్య, వైస్ చైర్మన్‌గా శ్రీశైలం గౌడ్, ధర్మకర్తలుగా పద్మ, మహేష్, మల్లయ్య, పూజారి విజయ్‌కుమార్ ప్రమాణం స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత, గిరివర్ధన్‌గౌడ్, రఫీ, రాంప్రసాద్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, నిరంజన్, ఖాజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

దేవరకద్ర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని శివాలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు నాగరాజు, నాగభూషన్, చైర్మన్ నరసింహరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో శివుడు

వన్యప్రాణులకు నల్లమల అనుకూలం

» పర్యాటకులకు పులులు కనిపించడంతో ఆనందం

» అమ్రాబాద్ ఎఫ్‌డీవో రాంమూర్తి

అమ్రాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవి ప్రాంతంలో వన్యప్రాణులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడడంతో వాటి సంఖ్య అభివృద్ధి చెందిందని అమ్రాబాద్ ఎఫ్‌డీవో రాంమూర్తి తెలిపారు. గురువారం అమ్రాబాద్ రేంజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సఫారీ పర్యాటకులకు పెద్దపులి, చిరుత, ఇతర వన్యప్రాణులు కనిపించడంతో వారి ఆనందానికి అవధులు లేవన్నారు. మహారాష్ట్రలోని తడోబా పెద్దపులుల అభయారణ్యంలో సఫారీకి వెళ్లిన 50 శాతం మంది పర్యాటకులకు పెద్ద పులులతో పాటు ఇతర వన్యప్రాణులు కనిపించడంతో అక్కడ పర్యాటకుల సంఖ్య పెరిగిందని తెలిపారు. అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో కూడా పర్యాటకుల సంఖ్యను పెంచడం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు వివరించారు. జంతువుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవిలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడినట్లు పేర్కొన్నారు. అమ్రాబాద్ అటవీ రేంజ్ అధికారి వీరేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు అపహరణ

మక్తల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏటీఎం సెంటర్‌లో ఏటీఎం కార్డులు మార్పిడీ చేసి రూ.40వేలు చోరీ చేసిన ఘటన గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మాగనూరు మండలం నేరడ్‌గం గ్రామానికి చెందిన వెంకటేష్, మరో వ్యక్తి కలిసి ఏటీఎం కార్డు ద్వారా డబ్బులు డ్రా చేసుకునేందుకు పట్టణంలోని సంగంబండ రోడ్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్దకు వెళ్లారు. వారికి ఏటీఎం కార్డు ఆపరేటింగ్ తెలియకపోవడంతో వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న ఓ వ్యక్తి తన వద్ద ఉన్న కార్డులు తీసుకొని డబ్బులు డ్రా చేసి ఇస్తామని నమ్మబలికి కార్డులు మార్పిడీ చేసి చాకచక్యంగా అక్కడి నుంచి ఉడాయించాడు. ఆ తర్వాత ఒక్కో కార్డు ద్వారా రూ.20వేల చొప్పున మొత్తం రూ.40వేలు డ్రా చేసుకున్నాడు. అనంతరం తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. అపరిచిత వ్యక్తులకు ఏటీఎం కార్డులు, పిన్ నెంబర్ తెలియజేయకూడదన్నారు.

భూమిని అక్రమంగా దున్నినవారిపై కేసు

గండీడ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో కేసు నమోదైన ఘటన మండలంలోని సల్కర్‌పేట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన జీ చంద్రయ్య కొన్నేళ్ల నుంచి కాస్తులో ఉన్న భూమి విషయంలో కొన్ని రోజులుగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్, కృష్ణయ్య, గోవర్ధన్ గొడవలు జరుగుతున్న విషయంలో వారు కోర్టుకి సంప్రదించి సివిల్ కేసు వేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 24న ట్రాక్టర్‌తో భూములకు ప్రవేశించి పొలం దున్నిన విషయంలో చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురి బైండోవర్

మానవపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురికి బైండవర్ చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో ఉన్న శివాలయం వద్ద నారాయణపేట జిల్లా మరికల్ మండలం జక్లేరు గ్రామానికి చెందిన మహేష్, వినోద్, షైబు, బాలకృష్ణ, కొండన్నపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం విచారించి తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఎదుట బైండవర్ చేసినట్లు తెలిపారు. మరోమారు అనుమానంగా రాత్రివేళల్లో తిరిగితే ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దార్ పేర్కొన్నట్లు వివరించారు.

మైనార్టీ కళాశాల తనిఖీ

నారాయణపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల(బాలుర)ను గురువారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎం.ఎ.రషీద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యకు సంబంధించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కాలేజీ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు. అకాడమిక్ కోఆర్డినేటర్ టీఎంఆర్ఈఐఎస్ మహ్మద్ సలీం ఉన్నారు. అనంతరం డీఎండబ్ల్యూవో కాలేజీలోని డైనింగ్ హాల్, డార్మిటరీ, వంట గదిని పరిశీలించి హెడ్ కుక్, హెల్పర్స్‌కు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

సీబీఎస్ఈ పేరుతో గాలం

» అనుమతి లేకున్నా అధిక ఫీజులు

» విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు

» ప్రశ్నార్థకంగా మారనున్న విద్యార్థుల భవిష్యత్



జడ్చర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సీబీ ఎస్ఈ పేరిట విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. అనుమతులు తీసుకోకుండానే తరగతులను నిర్వహిస్తున్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ విస్తృత ప్రచారం చేసుకుంటున్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టి మరీ ప్రచారం నిర్వహిస్తున్నా, విద్యాశాఖ అధికారుల దృష్టి ఆయా విద్యాసంస్థలపై పడకపోవడం గమనార్హం.

పలు పేర్లతో నిర్వహణ..

ప్రస్తుత విద్యాసంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లాలో 150కి పైగా దరఖాస్తులు వచ్చాయని ఇటీవల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఇచ్చారు. జడ్చర్ల పట్టణంలో ప్లే స్కూల్స్ పేరుతో పాటు పలు పాఠశాలలు పలు పేర్లతో ప్రారంభిస్తున్నారు. కల్వకుర్తికి వెళ్లే దారిలో 7వ తరగతి వరకు ఓ పాఠశాలను నెలకొల్పారు. అలాగే హౌసింగ్‌బోర్డులో 5వ తరగతి వరకు, అల్మాస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో, తాలుకా క్లబ్ ఏరియాలో అనుమతులు లేకుండానే ప్లేస్కూల్స్‌ను నెలకొల్పారు. అనుమతులు కలిగిన భవనంలో పాఠశాల నిర్వహించకుండా, మరో భవనంలోకి ఇటీవల ఓ పాఠశాలను మార్చారు. నేతాజీచౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న సదరు పాఠశాల స్టేట్ సిలబస్‌తో నిర్వహించగా, కొత్త భవనంలోకి మార్చుతూనే సీబీఎస్ఈ సిలబస్‌తో విద్యాబోధన చేస్తున్నామంటూ విస్తృత ప్రచారం చేపట్టింది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుమతులు ఇచ్చే ప్రక్రియలో హైస్కూల్ స్థాయిలో 8వ తరగతికి మొదటగా అనుమతి ఇచ్చి, అనంతరం వరుస విద్యాసంవత్సరాలలో 9, 10వ తరగతికి అనుమతులు ఇస్తుంది. కానీ సదరు పాఠశాల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండానే పదో తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో తరగతులను నిర్వహిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ విద్యార్థు లకు వార్షిక పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తారో యాజమాన్యానికే తెలియాలి. ఆడుకోవడానికి స్థలాలు ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం పొందుపరించింది. కొన్ని పాఠశాలలకు కనీసం ప్రార్థన స్థలం లేకున్నా, అనుమతులు ఎలా ఇచ్చారో విద్యాశాఖ అధికారులకే తెలియాలి.

ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా..

ప్రతీ విద్యార్థి పూర్తి సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యు డైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్), అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లతో పాటు పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్)లలో నమోదు చేసేలా కార్యక్రమాలు చేపడుతున్నాయి. అనుమతులు లేని పాఠశాలలో చదువుకునే విద్యార్థుల వివరాలు నమోదు కాకపోవడంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. వీరికి టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్), బోనఫైడ్‌లు జారీ చేయడానికి వీలుండదు. ప్రస్తుతం ఎస్ఎస్‌సీ విద్యార్థులకు మెమోలలో పెన్ నెంబరును నమోదు చేసి అందచేస్తున్నారు.

అనుమతులు తీసుకున్నాకే తరగతులు



పాఠశాల నిర్వహణకు సంబంధించి అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే తరగతులను నిర్వహించాలని పాఠశాలలు నెలకొల్పే వారికి సూచిస్తున్నాం. అనుమతులు లేకుండా నిర్వహిస్తే విద్యార్థులు నష్టపోతారు. అనుమతుల అంశంలో పూర్తిగా విచారణ చేపట్టిన అనంతరమే పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

- అయ్యుబ్‌ఖాన్, ట్రస్మా జిల్లా ప్రధానకార్యదర్శి

నోటీసులు జారీ చేస్తాం



అనుమతులు లేని పాఠశాలలకు నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా సీబీఎస్ఈ సిలబస్ తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలను తనిఖీ చేస్తాం. విద్యార్థుల భవిష్యత్‌కు ఆటంకం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

- మంజులాదేవి, ఎంఈవో జడ్చర్ల

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- సల్కాపురం క్రషర్ వద్ద ఘటన
- నిర్వాహకులతో కుటుంబ సభ్యుల వాగ్వాదం



సల్కాపురం గుట్టలో క్రషర్ వద్ద మృతి చెందిన వృద్ధుడిని పరిశీలిస్తున్న పోలీసులు

గట్టు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని సల్కాపురం గట్టు వద్ద గల క్రషర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వి వరాల ప్రకారం.. జోగన్‌గట్టుకు చెందిన ఆంజనేయులు (55) గురువారం గట్టు కు వెళ్లి వస్తుండగా సల్కాపురంలోని క్రషర్ వద్దకు పోయాడు. అనంతరం అక్కడ సిబ్బంది అతనికి భోజనం పెట్టారు. భోజనం చేస్తుండగానే కింద పడిపోయాడు. వెంటనే తేరుకున్న సిబ్బంది ఎంత లేపినా లేవలేదు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడి చేరుకుని మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన వందల మంది క్రషర్ వద్దకు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అందరూ భోజనం చేశారని, కానీ ఆంజ నేయులు మాత్రమే ఎలా మృతి చెందుతాడని వారు కంపెని సిబ్బందిని ప్రశ్నించారు. ఆందోళన పెద్దది కావడంతో సమాచారం పోలీసులకు చేరింది. వెంటనే అక్కడికి చేరుకుని ఘటనపై విచారణ చేపట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం



ఉండవల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన బాధితురాలు

అలంపూరుచౌరస్తా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఓ మహిళ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన మాదర్‌సాబ్ భార్య ఖజాబీ 30ఏళ్ల క్రితమే అతన్ని వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతడిని అన్న కూతురు అయిన రిజ్వాన బాగోగులు చూసినందుకు తమ చిన్నాన్నకు చెందిన 1.38 ఎకరాల భూమిని రిజ్వానకు చెందేలా వీలునామా రాయించుకుంది. మాదర్‌సాబ్ అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త చనిపోయాడన్న విషయం తెలుసుకుని ఖాజాబీ గ్రామానికి వచ్చి భర్త మరణధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుని, కుటుంబ ధ్రువీకరణపత్రం పొంది తన భర్త పొలాన్ని విరాసత్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుంది. విషయం తెలుసుకున్న రిజ్వాన, ఆమె కుటుంబ సభ్యులు గురువారం తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దారును అడితే ప్రయత్నం చేస్తుండగా అక్కడి సిబ్బంది బయటకు పంపించేశారు. దీంతో రిజ్వాన తలపై పెట్రోల్ పోసుకుంది. 30ఏళ్ల పాటు తన చిన్నాన్న బాగోగులు చూసుకున్నానని, చనిపోయాక అతడి పొలం భార్యకు ఎలా చేస్తారని వాపోయింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శేఖర్ అక్కడికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పి పంపించేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

మక్తల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మాగనూరు మండలంలోని సత్యవార్ గ్రామానికి చెందిన ఆంజనేయులు, ఊట్కూర్ మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

గండీడ్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగయ్య అనే రైతు పొలం వద్ద రోజు మాదిరి ఆవులను మేత మేపుతున్న సమయంలో ఓ ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.80 వేలు విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

భార్యాభర్తలపై దాడి, కేసు నమోదు

నవాబ్‌పేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భాగ పరిష్కారంలో తమ వాట ఇవ్వాలని గొడవ పడగా అన్న, వదినలపై దాడి తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల గ్రామానికి చెందిన వెంకట్రాములుతో పాటు మరో నలుగురు అన్నదమ్ములున్నారు. రెండవ తమ్ముడైన నర్సింహులు, భార్య కలిసి తమకు భాగ పరిష్కారంలో వాటా ఇవ్వాలని కోరుతూ ఈనెల 20న వెంకట్రాములుతో గొడవపడ్డారు. చిన్నవాడైన రమేష్ వివాహం అనంతరం ఆస్తి పంపకాలు చేసుకుందామని చెప్పినా వినకపోవడంతో పాటు వెంకట్రాములు, భార్య కోస్గి పద్మమ్మపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఊట్కూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దజట్రం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. మండలంలోని పెద్దజట్రం గ్రామంలో బియ్యం ఉన్నాయనే సమాచారంతో సివిల్ సప్లయ్ ఆర్‌ఐ వెంకటేష్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ బృందం గ్రామంలోని రాజు ఇంట్లో తనిఖీ చేయగా గదిలో 20 సంచుల్లో 30 నుంచి 35 కిలోల చొప్పును పీడీఎస్ బియ్యం ఉంచుకున్నట్లు గుర్తించారు. మొత్తం 7.30 క్వింటాళ్లు ఉన్నట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని మండల కేంద్రంలోని చౌక ధర దుకాణంలో నిల్వ చేసి, రాజును అదుపులో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు



కురువ చిన్న కర్రెన్న

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. కుమారుడు కురువ నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ఉదయం కురువ చిన్న కర్రెన్న కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాలేదు. దీంతో గురువారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వస్తుందని పేర్కొన్నారు. వృద్ధుడి ఒంటిపై తెలుపు, నీలి రంగు దుస్తులు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

బీసీ స్టడీ సర్కిల్

నిరుద్యోగులకు వరం



గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న యువతీయువకులు

- 6 సంవత్సరాల్లో 1,800 మందికి శిక్షణ
- 50 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు
- గద్వాల, వనపర్తి జిల్లాల వారికి శిక్షణ

గద్వాల టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యార్హతలు ఎన్ని ఉన్నా సరైన శిక్షణ లేకపోతే ఉద్యోగావకాశాలు అందుకోవడం కష్టంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో స్టడీ సర్కిళ్ల ఏర్పాటు అనివార్యంగా మారింది. ఈ క్రమంలో జోగుళాంబ గద్వాల జిల్లా ఏర్పాటు అనంతరం అందుబాటులోకి వచ్చిన తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన నిరుపేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతీ యువకులకు వరంగా మారింది. 2016లో జిల్లా ఏర్పాటు అనంతరం రెండేళ్ల తర్వాత ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిళ్ల మంజూరుకు నిర్ణయం తీసుకున్నది. రెండవ విడతలో గద్వాల జిల్లాకు అవకాశం దక్కింది. అప్పటి తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు గద్వాల ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆంజనేయ గౌడ్ చొరవతో రాష్ట్రంలో రెండవ బీసీ స్టడీ సర్కిల్ గద్వాలకు రావడం విశేషం. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిలాల్లో ఉద్యోగార్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన బీసీ స్టడీ సర్కిల్‌కు ఇప్పటి వరకు మొత్తం 1,725 మంది ఎంపికయ్యారు. వారిలో 1,384 మంది రెగ్యులర్‌గా తరగతులకు హాజరై శిక్షణ పొందారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు 75 శాతం హాజరు ఆధారంగా రూ.1500 చొప్పున ప్రతీ నెల స్టైఫండ్ ఇస్తున్నారు. వారిలో ఇప్పటి వరకు 50 మందికి పైగా వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. మరో 150 మందికి పైగా అభ్యర్థులకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా అవకాశం లభించింది.

విభిన్న నోటిఫికేషన్లపై శిక్షణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగావకాశాల కోసం జారీ చేసే నోటిఫికేషన్ ఆధారంగా గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో విభిన్న రకాల కోర్సులపై శిక్షణ లభిస్తుండటం గమనార్హం. 2019, మే నుంచి ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌బీ, గ్రూప్-2 ఉద్యోగాలకు శిక్షణ తరగతుల వరకు అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. అందుకోసం హైదరాబాద్ నుంచి సబ్జెక్టు నిపుణులను రప్పించి శిక్షణ ఇప్పిస్తుండటం వల్ల అభ్యర్థులు సత్ఫలితాలు సాధిస్తున్నారు. గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటి వరకు గ్రూప్ ఫౌండేషన్ కోర్సు, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ అండ్ ఎస్‌ఎస్‌సీ ఫౌండేషన్ కోర్సు, గ్రూపులు, టీచర్లు, ఎస్‌ఐ అండ్ పోలీస్ కానిస్టేబుళ్లు, ప్రిలిమ్స్-2021, 22, ఫోర్ వీలర్ డ్రైవింగ్ ప్రోగ్రాంలలో శిక్షణ ఇచ్చారు. అలాగే గ్రూప్-1 ప్రిలిమ్స్-2022, గ్రూప్-3, 4, ఎస్‌ఐ అండ్ పోలీస్ కానిస్టేబుళ్లు, మెయిన్స్ - 2023, గ్రూప్-2 (2023), గురుకుల టీచర్లు (2023), గ్రూప్-1 ప్రిలిమ్స్ - 2024, డీఎస్సీ టీచర్లు (ఆన్‌లైన్ అండ్ బుక్ ఫౌండేషన్) ఉద్యోగార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఉపయోగకరంగా ఉంది



ఆర్‌ఆర్‌బీతో పాటు గ్రూప్-2లో అందుతున్న శిక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నాకు విషయాలు సులభంగా అర్థం అవుతున్నాయి. గ్రూప్-2లో ఉద్యోగం సాధించడం నా కల. అందుకోసం స్టడీ సర్కిల్‌లో లభిస్తున్న శిక్షణతో లక్ష్యంపై మరింత నమ్మకం ఏర్పడింది.

- రాణి, అనంతపురం

ఎస్‌ఐ జాబ్ నా లక్ష్యం



పోలీస్‌శాఖలో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా జాబ్ కొట్టాలన్నది నాలక్ష్యం. స్టడీ సర్కిల్‌లో లభిస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. కోచింగ్ సెంటర్ వనపర్తిలోనే ఉండి ఉంటే మరింత బాగుండేది. ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిళ్ల ఏర్పాటు చేసి నిరుద్యోగులకు మేలు చేయాలి.

- శివకుమార్, వనపర్తి

రైల్వేలో జాబ్ నా ఆకాంక్ష



ఇండియన్ రైల్వేలో అధికారిగా చేరాలన్నది నా ఆకాంక్ష. అందుకు అనుగుణంగా ఆర్‌ఆర్‌బీలో కోచింగ్ పొందుతున్నారు. కోచింగ్ సెంటర్‌లో ప్రతీ రోజు సబ్జెక్టు నిపుణులు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంది. జిల్లా ఏర్పాటు వల్లే మాలాంటి నిరుద్యోగ యువతీ యువకులకు ఇలాంటి అవకాశం లభించడం సంతోషంగా ఉంది.

- శిరీష, వనపర్తి

త్వరలోనే సొంత భవనం



గద్వాల బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రతీ ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్నందున అభ్యర్థులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించడంలో కొంత ఇబ్బంది ఎదురవుతోంది. సొంత భవనం నిర్మాణం కోసం రెండవ రైల్వేగేటు సమీపంలో ప్రభుత్వం కొంత స్థలాన్ని కేటాయించింది. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

- కె.రాములు, డైరెక్టర్, గద్వాల బీసీ స్టడీ సర్కిల్

పేదల్లో వికాసం నింపింది మోదీనే

- ఆశ పెట్టి మోసం చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కే సాధ్యం
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఖిల్లాఘణపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల్లో వికాసం నింపింది 11 ఏళ్ల మోదీ ప్రభుత్వమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం బీజేపీ జెండా ఆవిష్కరించి వికసిత్ భారత్‌లో భాగంగా 11 ఏళ్ల బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాలన విజయాలు, దేశ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే బడుగు బలహీన వర్గాల ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద డబ్బులు అందిస్తుందని గుర్తు చేశారు. రైతులకు సబ్సిడీపై ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీకి ఐదు కేజీలకు నిధులు కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యత లేని బియ్యం సరఫరా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు ఆశ పెట్టడం మోసం చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకే సాధ్యమని విమర్శించారు.

57 ఏళ్ల దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని మర్చిపోయారన్నారు. రూ.4వేల పెన్షన్, రూ.2,500 మహాలక్ష్మి, రూ.500 సిలిండర్, విద్యార్థినులకు స్కూటీలు లాంటి పథకాలు అటకెక్కించారని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, బుచ్చిబాబు గౌడ్, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, సీతారాములు, పెద్దిరెడ్డి, ఆశన్న, నవీన్‌రెడ్డి, శివ శంకర్, సాయినాథ్, సత్యనారాయణ, గోపి, దశరథ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సాయిచంద్ యాది’లో సభను జయప్రదం చేయాలి

- గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని
- అమరచింతలో ఇంటింటి ప్రచారం



అమరచింతలోని ఎంబీ చర్చిలో ప్రచారం నిర్వహిస్తున్న రజిని, నాయకులు

అమరచింత, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా అమరచింతలో ఈనెల 29న దివంగత సాయిచంద్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభను జయప్రదం చేయాలని గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని పిలుపునిచ్చారు. గురువారం సాయిచంద్ యాదిలో బహిరంగసభను జయప్రదం చేయాలని పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బహిరంగ సభకు మాజీ మంత్రులు కల్వకుంట్ల రామారావు, హరీష్ రావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కళాకారులు రానున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌సింగ్, ఎస్‌ఏ రాజు, నరేష్‌రెడ్డి, రమేష్, అక్కల నర సింహులుగౌడ్, నాగభూషణం గౌడ్, చిన్న బాలరాజు, రాజ్‌కుమార్, రవి, శేఖర్, రాజశే ఖర్, కలాం పాషా, శరత్, ప్రేమ్, అలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సభా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

బహిరంగ సభ స్థలాన్ని అమరచింతలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్లు పరిశీలించారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద విగ్రహం కోసం ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించి, అనంతరం ప్రభుత్వం హైస్కూల్ గ్రౌండ్‌లో సభా స్థలాన్ని చూశారు.

భోజన నాణ్యతలో రాజీ పడొద్దు

- వీసీ జీఎన్ శ్రీనివాస్
- పీయూలోని బాలుర హాస్టల్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనిర్సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని బాలుర హాస్టల్‌ను గురువారం అధికారులతో కలిసి వీసీ జీఎన్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైన సమస్యలుంటే తమ దృషికి తీసుకురావాలని రోడ్డెక్కి ధర్నాలు చేయకూడదని విద్యార్థులను సూచించారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఎక్కడా రాజీ పడకూడదని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు సమస్యలు వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, మధుసూదన్‌రెడ్డి, రవికాంత్, కృష్ణయ్య, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో టూరిస్టు బస్సు బోల్తా

- బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండను ఢీకొట్టిన డ్రైవర్
- జనగామ నుంచి శ్రీశైలం వెళుతున్న భక్తులు
- తప్పిన ప్రాణాపాయం, ఏడుగురికి స్వల్ప గాయాలు



ఈగలపెంట జెన్‌కో ఆసుపత్రికి వచ్చిన ప్రమాద బాధితులు

దోమలపెంట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : టూరిస్టు బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి కొండను ఢీకొట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని నల్లమల ఘాట్ రోడ్డుపై గురువారం ఉదయం చోటుచేసుకున్నది. ఈగలపెంట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా నుంచి శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం బుధవారం రాత్రి నాగరాజు అనే వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శ్రీశైలానికి టూరిస్టు బస్సులో బయలుదేరారు. గురువారం ఉదయం దోమలపెంట ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోకి వచ్చాక బస్సు బ్రేకులు ఫెయిల్ అయినట్టు డ్రైవర్ సురేష్ గుర్తించి భక్తులను అప్రమత్తం చేశాడు. దారిలో ఒక ఆవు, రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును బస్సు ఢీకొట్టింది. వేగంగా వెళుతున్న టూరిస్టు బస్సు అదుపు కావడంలేదని, ఇక ముందుకు వెళితే ప్రాణ నష్టం జరుగుతుందని గమనించిన డ్రైవర్ దోమలపెంట బస్టాండ్ సమీపంలో కొండను ఢీకొట్టడంతో బస్సు బోల్తాపడింది. ఇందులో 17 మంది పెద్దలు, 12 మంది చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో నాగరాజు, డ్రైవర్ సురేష్, రేణుక, రోహిత్ మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారికి ఓ అంబులెన్స్‌లో ఈగలపెంట జెన్‌కో ఆసుపత్రిలో చికిత్స చేసి పంపించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఏఎస్‌ఐ బాల్‌నాయక్ వారు చెప్పారు.

జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపిక



శిరీష



అరవింద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ /అయిజ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో ఈ నెల 28 నుంచి జూలై 1 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పురుషుల కబడ్డీ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు బాలానగర్ మండలం లింగారెడ్డి గూడకు చెందిన అరవింద్ ఎంపిక య్యాడు. జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికావటంపై జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాల రాజు, నర్సింహులు అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని సూచించారు.

● అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని మేడికొండ గ్రామానికి చెందిన శిరీష అండర్-18 విభాగంలో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు స్థానం సంపాదించింది. ఈమె రంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఆనంద్‌గౌడ్



అవార్డు అందుకుంటున్న పాలెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్

బిజినేపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ప్రభుత్వ ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్‌కు తక్కువ డ్రాప్ అవుట్ ఉన్న పది కళాశాల్లో పాలెం కళాశాల నిలిచినందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా గురువారం ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల్లో నిష్ణాతులైన ఉపన్యాసకులు, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్స్ ఉండి ఆహ్లాదకరమైన వాతావరణంలో కళాశాల క్యాంపస్ ఉందన్నారు. అవార్డు అందుకున్న ఆనంద్‌గౌడ్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మదన్‌మోహన్‌రెడ్డి, బండి నరసింహ, ఎండీ గౌస్, వినోద్, పద్మజ, జానయ్య, విష్ణు, ప్రవీణ్, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

నేర పరిశోధనలో అవగాహన ఉండాలి

- శిక్షణ అధికారి రాజేంద్రప్రసాద్



నేర పరిశోధనపై పోలీసులకు శిక్షణ అందిస్తున్న అధికారి రాజేంద్రప్రసాద్

కోయిలకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో పోలీసులు మరింత అవగాహన కలిగి, వేగంగా ఛేదించేందుకు కృషి చేయాలని జిల్లా నేర పరిశోధన అధికారి రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ పోలీస్‌స్టేషన్‌లో నేర పరిశోధన నూతన ల్యాబ్‌ను ప్రారంభించి పోలీసులకు శిక్షణ ఇచ్చారు. కేసు ఛేదనలో పోలీసులు వేలి ముద్రలు, పాద ముద్రలు ఏవిధంగా తీసుకోవాలన్న విషయం గురించి అవగాహన కల్పించారు. నేరస్తుడిని ఎలా గుర్తించాలి, వారి పాత నేరాలు గురించి తెలుసుకునేలా నూతన టెక్నాలజీ వాడాలన్నారు. ఈ ల్యాబ్ ద్వారా కేసుల ఛేదన వేగవంతం అవుతుందని రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

విద్యుత్ సమస్యలను అధిగమిస్తాం

● అనిల్‌కుమార్ రెడ్డి, ఏఈ, ధరూరు



ధరూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సమస్యలను అధిగమించి, నిరంతర సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మండల ఏఈ అనిల్‌కుమార్ రెడ్డి చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఉచిత కరెంటు అమలవుతున్నదా?

మండలంలో 200యూనిట్ల లోపల విద్యుత్ మీటర్ రీడింగ్ ఉన్న వారికి ఉచిత కరెంటు వర్తిస్తుంది. ఇప్పటికే సుమారు 60శాతం 200యూనిట్లలోపు ఉన్న లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందుతుంది.

24గంటలు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నారా?

మండలంలో ఐదు సబ్‌స్టేషన్ల ద్వారా ఇటు రైతులకు, అటు గృహాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా కొనసాగుతున్నది.

ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లకు సంవత్సరానికి ఒకసారి మరమ్మతులు చేస్తున్నాం. బ్రేక్ డౌన్, ఆయిల్ మార్పిడి వంటి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

విద్యుత్ సిబ్బంది కొరత ఉందా?

మండలంలోని ఉన్న ఐదు సబ్‌స్టేషన్లలో కొద్దిగా సిబ్బంది కొరత ఉంది. ఈవిషయంపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. త్వరలోనే సిబ్బంది నియామకాలు చేపడతామని తెలిపారు.

న్యూస్ బాక్స్

కార్మికులు తమ హక్కులను కూడా తెలుసుకోవాలి

అయిజ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులు తమకు ఉన్న హక్కులు తెలుసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ అన్నారు. గురువారం అయిజలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీరోజు వివిధ రకాల సంస్థల్లో పనిచేసే అసంఘటిత రంగ కార్మికులు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని, సమాజంలో గౌరవ ప్రదమైన జీవితం గడపాలని చెప్పారు. కార్మికుల హక్కుల పరిరక్షణకై వచ్చేనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఈశ్వర్, శ్రీను, శంకర్‌గౌడు, గోవిందు, వీరేష్, ఆడివెన్న, మహేంద్ర పాల్గొన్నారు.

అందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» బోరవెల్లిలో 41మంది గుర్తింపు

మానవపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరవెల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల పరిస్థితి, ప్రస్తుతం ఏ ఇంట్లో ఉండి జీవనం చేస్తున్నారనే విషయంపై ఎంపీడీవో ఆధ్వర్యంలో పరిశీలించారు. గ్రామంలో మొత్తం 890మంది దరఖాస్తు చేసుకోగా మొదటి దశలో 41మందిని ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునేందుకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ నాయకుల జాబితా నుంచి 25మంది, ఎమ్మెల్యే కోటలో 16మందిని ఎంపిక చేశామని, నిబంధనల ప్రకారం ప్రతీ లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అరుణ నాయకులు పాలరాజు, కరెంట్ భాష, మహమ్మద్ బాషా, వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

మల్దకల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎన్ఎం సుజాత ఆధ్వర్యంలో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తక విక్రయాలు అరికట్టాలి

» ఎంఈవోకు విద్యార్థి సంఘాల వినతి

అయిజ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న పుస్తకాల విక్రయదందాను అరికట్టాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ఎంఈవో రాములుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పుస్తకాలు విక్రయించకుండా నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారీతిన పుస్తకాలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అయిజలో ఓ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన బుక్కుల దుకాణాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాళం వేయటం జరిగిందని వారు వివరించారు. ఈ క్రమంలోనే అయిజ పట్టణానికి చెందిన కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు పుస్తకాల విషయంలో వివిధ ప్రైవేటు పాఠశాలల్లో గందరగోళం జరుగుతుందని వెంటనే అధికారులు జోక్యంచేసుకుని విద్యాసంస్థలు నిబంధనల మేరకు నడిచేలా చర్యలు తీసుకోవాలని విద్యాధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లికార్జున్, వీరేష్, హలీంబాషా, హరీశ్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

● కంకరతేలి అవస్థలు పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు



కోతకు గురై గోతి ఏర్పడిన సెట్టింపాడు-నీలహళ్లి మట్టిరోడ్డు



పూర్తిగా ధ్వంసమైన జూరాల-మన్నాపురం బీటీ రోడ్డు

ధరూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు వేసిన బీటీ రోడ్డు గుంతమయంగా మారాయి. దీంతో పల్లెవాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 15సంవత్సరాల క్రితం నిర్మించిన రహదారులను కనీసం మరమ్మతులు చేయడంలేదు. ధరూరు-చింతరేవులకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు, బ్రిడ్జిధ్వంసం కావడంతో వాహనదారులు రాకపోకలకు నానాతంటాలు పడుతున్నారు. గ్రామీణ బీటీరోడ్లు రాళ్లు, కంకరతేలి ప్రమాదకరంగా మారాయి. బీరబండ గ్రామస్థులు నిత్యం చింతరేవుల, వామన్‌పల్లి గ్రామాలకు, గుర్రంపల్లివాసులు నిత్యం ధరూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో కంకరతేలిన రోడ్లు, కుంచించుకుపోయిన దారులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా గ్రామీణ రహదారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించి నూతన రోడ్లు వేయించా లని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

మండలంలోని గ్రామీణ బీటీరోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు మంజూరైతే గుంతల రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం. కొత్తగా రోడ్లు కూడా నిర్మిస్తాం.

\- నాగరాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మల్దకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ బీఎం సంతోష్

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

మల్దకల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇంటిని మంజూరు చేస్తూ వారి సొంత ఇంటి కలను నిజం చేసిందన్నారు. గురువారం మల్దకల్‌లోని రైతువేదికలో కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మండలానికి మొదటి విడతగా 480 ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతతో మరిన్ని ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిరకాల పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులను ఎన్నుకోవాలన్నారు. కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. గద్వాల నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు నెలలోపు నిర్మాణం ప్రారంభించాలని సూచించారు.మొదట బేస్‌మెంటికి లక్ష రూపాయలు, రెండవ విడతో రూ.2లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. విడతల వారీగా నగదును ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ ఎంపీపీ బిజ్వారం సత్యారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గట్టు మాజీ ఎంపీపీ విజయకుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి, ఎంపీడీవో ఆంజనేయరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో బోధన చేయాలి

» అమరవాయి జడ్పీహెచ్‌ఎస్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ బీఎం సంతోష్

మల్దకల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు నిబద్ధతతో బోధించాలని బీఎం సంతోష్ సూచించారు. గురువారం మండలంలోని అమరవాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, ల్యాబ్, మెస్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా స్పష్టంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు పూర్తిస్థాయిలో ఉండాలని తెలిపారు. స్మార్ట్ బోర్డులను పరిశీలించారు. గోడపై మధ్యాహ్న భోజన మెనూను ఆకర్షణీయంగా ఉంచిన ఉపాధ్యాయుడిని అభినందించారు.

మెరుగైన ఫలితాల కోసం కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సురేష్, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

డ్రగ్స్‌రహిత జిల్లా కోసం కృషి చేద్దాం

● కలెక్టర్ బీఎం సంతోష్ పిలుపు

● నియంత్రణలో యువత భాగస్వాములు కావాలి : ఎస్పీ



గద్వాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాలను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పౌరులంతా బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కృష్ణవేణి చౌరస్తా వద్ద ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పాతబస్టాండ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మదకద్రవ్యాల నిరోధక కమిటీలను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలన్నారు.ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి సునంద, డీఎంహెచ్‌వో సిద్ధప్ప, డీఎస్పీ మొగిలయ్య, ఎక్సైజ్, పోలీస్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

● మానవపాడు : యువత సరదా కోసం మాదక ద్రవ్యాలను అలవాటు చేసుకుని జీవితంలో ఇబ్బందులు పడతారని సీఐ టాటాబాబు అన్నారు. యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జీవీ దర్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీఐ టాటాబాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రకాంత్, సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

● ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

మల్దకల్: జీవితాలను చిన్నాభిన్నం చేసే మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సింహులు సూచించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో పీవో రామాంజనేయులుగౌడ్, అధ్యాపకులు గోవర్ధన్‌శెట్టి, మాధురి, బాలకృష్ణ, నీలవేణి, సుధాకర్, శ్రీనివాసులు, హనుమంతు ఉన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

వడ్డేపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అలంపూర్‌లో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించే జిల్లాస్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గురువారం శాంతినగర్‌లోని కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సీపీఎం పార్టీ సభ్యులు,కార్యకర్తలు, ముఖ్యనాయకులు అందరూ హాజరుకావాలని చెప్పారు. సమావేశంలో మండల కార్యదర్శి పరంజ్యోతి, నాయకులు వేణు, రాజు, నరసింహులు ఉన్నారు.

● రాజోలి: జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఫెడరేషన్‌లు చేయతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. గురువారం రాజోలిలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, యూటీఎఫ్ నాయకులు తిప్పన్న, రమేష్, అలాగే నీలావతి, సువర్ణ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి

రాజోలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, నాణ్యమైన విద్యను అందించేందుకు ఏఏపీ కమిటీలు కృషి చేయాలని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. గురువారం రాజోలి ఎమ్మార్సీ భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమిటీ చైర్మన్లు నిత్యం పాఠశాలల పర్యవేక్షణ చేస్తూ, పిల్లల సమస్యలు తెలుసుకొని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ హినిమిరెడ్డి, ఏపీపీ చైర్మన్లు బుజ్జమ్మ, మానస, హసీనా బేగం, పద్మమ్మ, మద్దమ్మ పాల్గొన్నారు.

నేడు డీఈఈ సెట్ అభ్యర్థుల విద్యా ధ్రువపత్రాల పరిశీలన

గద్వాల సర్కిల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నేడు (శుక్రవారం) డీఈఈ సెట్‌లో అర్హత పొందిన అభ్యర్థుల రెండో విడత విద్యా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని, పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డీఈఈ సెట్ -2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ర్యాంకు కార్డ్, హాల్ టికెట్, మార్క్స్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో పాటు ఆదాయం, గేమ్స్, వైకల్యం తదితర సర్టిఫికెట్లను తమవెంట తెచ్చుకోవాలని సూచించారు.

గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో స్పష్టత ఇవ్వాలి

● ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

గద్వాల టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ప్రతినిధిగా ఎన్నికైన గద్వాల ఎమ్మెల్యే తాను ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు స్పష్టతనివ్వాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుతో గెలుపొంది అనంతరం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే తాను ఇప్పటికీ ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యుడినే అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుండటం సిగ్గుచేటన్నారు. గురువారం పట్టణంలోని పోరాట సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రంజిత్‌కుమార్ మాట్లాడారు. గతంలో తన అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలో తన ఫొటో పెట్టారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే తనఇంట్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఏఐసీసీ నాయకులను ఎలా రప్పించారని ప్రశ్నించారు. సమావేశంలో కన్వీనర్ బుచ్చిబాబు, రంగస్వామి, వెంకట్రాములు, విష్ణు, తిమ్మప్ప, చిన్నరాముడు, వెంకటేష్, ఆశన్న, గోపాల్, నాగేష్ ఉన్నారు.

స్కూల్ అనుమతి రద్దు చేయాలి

గద్వాలన్యూటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అయిజలోని కృష్ణవేణి హైస్కూల్ యజమాని స్కూల్ పక్కనే ఫేక్ సర్టిఫికెట్‌తో బుక్‌సెంటర్ ఓపెన్ చేసి పుస్తకాలు అమ్ముతున్నారని, వెంటనే ఆ పాఠశాల అనుమతిని రద్దుచేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లయ్య, పీడీఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

హంతకులను ఉరి తీయాలి

గద్వాల సర్కిల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దారుణ హత్యకు గురైన తేజేశ్వర్ హంతకులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి గద్వాలలో మృతుని కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఒక అమాయకుడిని పాశవికంగా చంపేసిన వారికి కఠినశిక్ష పడాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ అభివృద్ధిలో బీజేపీది కీలకపాత్ర

మల్దకల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ప్రధాని మోదీ 11ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా గురువారం ఉలిగేపల్లిలో మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు రఘు, ఉలిగేపల్లి తిమ్మప్ప, కార్యకర్తలు ఉన్నారు.

కలెక్టరేట్‌లో సోలార్ పవర్ ప్లాంట్ పనులు

» పరిశీలించిన కలెక్టర్ సంతోష్

గద్వాల న్యూటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం సోలార్ పవర్ ప్లాంట్ పనులను కలెక్టర్ బీఎం సంతోష్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ అవసరాలను తగ్గించేందుకు, పర్యావరణహిత మార్గాన్ని అనుసరించేలా సోలార్‌శక్తిని వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్‌లో వాహనాల పార్కింగ్ కోసం 39.5 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ పార్కింగ్ షెడ్ నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. ఇది వాహనాలకు నీడనిచ్చేందుకు తోడ్పడటంతో పాటు సోలార్ ప్యానళ్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి కార్యాలయాల్లో వినియోగించేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. చేపట్టిన పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో శ్రీ అసోసియేట్స్ జనరల్ సెక్రటరీ శ్రీహరిబాబు, తదితరులు ఉన్నారు.

క్రీడాపోటీల్లో ప్రతిభ చూపాలి



స్టాండింగ్ బ్రాడ్ జంప్ చేస్తున్న విద్యార్థి

● డీవైఎస్‌వో జితేందర్

● జిల్లాస్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

గద్వాల అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వివిధ క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి క్రీడా పాఠశాలలకు అధికసంఖ్యలో ఎంపికై జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలని డీవైఎస్‌వో జితేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో రాష్ట్ర క్రీడాపాఠశాలల్లో ఎంపిక కోసం జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడాంశాల్లో సామర్థ్య పరీక్షల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యేటా హకీంపేట, అదిలాబాద్, కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలల్లో ఎంపికకు నిర్వహించే పోటీల్లోలో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని పోటీల్లో రాణించాలన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర పరిశీలకులుగా జైరాకేష్ వ్యవహరించారన్నారు.

కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బీసన్న, భరత్ కుమార్, నాగేష్‌బాబు, హైమావతి, సుహాసిని, సతీష్, రజనీకాంత్ ఉన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

● ఏడీఏ సంగీత లక్ష్మి



మల్దకల్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీచేస్తున్న ఏడీఏ సంగీత లక్ష్మి

మల్దకల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ కలిగిన ఎరువుల డీలర్లు రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఏడీఏ సంగీతలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ ఆయా దుకాణాల్లో నిల్వఉన్న స్టాకు వివరాలు, రిజిస్టర్‌లను, అమ్మకాల పరిశీలించారు. అనంతరం మాట్లాడిన ఏడీఏ ఈ-పాస్ మెషిన్ ద్వారానే అమ్మకాలు చేపట్టాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం



మాట్లాడుతున్న బాసు హనుమంతునాయుడు

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు

గద్వాల న్యూటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయం ఖాయమని, ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హనుమంతునాయుడు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతునాయుడు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు అన్నివర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారని మండిపడ్డారు. అందుకే బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, చక్రధర్‌రావు, రాఘవేంద్రరెడ్డి, మోనేశ్, రాజారెడ్డి, శ్రీనివాసగౌడు, అతికూర్ రెహమాన్, రామునాయుడు, బీచుపల్లి, గంజిపేట రాజు, కుర్వ పల్లయ్య, వెంకటేశ్‌నాయుడు, శ్రీరాములు, సామేలు, భాస్కర్, గోవిందు తదితరులు ఉన్నారు.

తిమ్మప్పస్వామికి పూజలు

మల్దకల్ : మల్దకల్‌లోని స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామిని గురువారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మోనేస్, శేఖర్‌నాయుడు, వెంకటేష్, రామునాయుడు, గంజిపేట రాజు, బాసు గోపాల్, సామెలు, రాములు పూడురు అంజి, గోవర్ధన్, రాజు పార్టీ కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

లక్ష్యాలపై యువత దృష్టి సారించాలి

● లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ రాజేందర్

గద్వాల టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవితాలను నాశనం చేసే మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను చేరుకోవడంపైనే దృష్టి సారించాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్ సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక సత్యసాయి పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ రాజేందర్, శ్రీనివాసులు, లక్ష్మణస్వామి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహేందర్, హెడ్‌మాస్టర్ అర్చన, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

పాలమూరు సమస్యలపై సదస్సుకు తరలిరండి



సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

● పీఏవీ జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాష

గద్వాల టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రెండు జీవనదుల మధ్య ఉన్న గద్వాల నడిగడ్డతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం కోసం జూలై 5న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు ఏర్పాటు చేశామని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాష తెలిపారు. సదస్సు కరపత్రాన్ని గురువారం పట్టణంలోని టీజేఎస్ కార్యాలయంలో విడుదల చేశారు. విద్యావంతులు, మేధావులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ, ప్రజాసంఘాల నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, ఎండీ సుభాన్, అబ్దుల్‌బాబు, వినోద్, మక్బుల్, డాక్టర్ ప్రేమ్‌కుమార్, కృష్ణయ్య, నాగరాజు ఉన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించాలి

● అయిజ టౌన్: అయిజలోని అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇక్బాల్ పాష, విజయభాస్కర్‌రెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, ప్రసాద్, రాజు, హనుమంతు, గోవిందు, రామన్న, భీమన్న, నజీర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.